నేటి దినపత్రిక సూర్య
17వ
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం,16 మార్చి 2024



# రూ. 9.98 లక్షలు విలువచేసే 91 సంచులతో పిడిఎస్ బియ్యం పట్టివేత...



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పాల్వంచ నుంచి కాకినాడ కు అక్రమంగా పిడిఎస్ బియ్యంతరలిస్తున్న వాహనాన్ని సామర్లకోట పట్టణం వద్ద విజిలెన్స్, సివిల్ సప్లై, రెవిన్యూ అధికారులు దాడులు జరిపి పట్టుకున్నారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న వాహన డ్రైవర్లపై స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించి వారిపై 6(ఎ ), క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సివిల్ సప్లై అధికారులు అందించిన వివరాల ప్రకారం సామర్లకోట సమీపములో అశోక్ లేలాండ్ పెద్ద వ్యాన్ లో పి.డి.ఎస్(రేషన్ బియ్యం)తో వెళ్ళుతున్నట్టు వచ్చిన సమాచారముతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల బృందం వాహనాన్ని కనుగొని దానిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేసారు. కాగా ఆ వాహనంలో 91 ప్లాస్టిక్ బస్తాలలో సుమారు 4357 కేజీల పి.డి.ఎస్ బియ్యం ఉన్నట్టు అధికారులు గమనించారు. ఈ పి.డి.ఎస్ బియ్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం మండలం లోని మెదరబస్తి గ్రామమునకు చెందిన యజమాని ఎ పవన్ సేకరించి కొత్తగూడెం మండలం లోని హేమచంద్రపురం గ్రామానికి చెందిన డ్రైవర్లు చందు, పి. సాయి భారత్ లు కొత్తగూడెం మండలము లోని పాల్వంచ గ్రామము నుండి కాకినాడకు తరలిస్తున్నట్టు తెలిపారు. ఈ పి.డి.ఎస్ బియ్యం విలువ సుమారు రూ 9,98,243 లుగా ఉంటుందని వారు తెలిపారు. దానితో పి.డి.ఎస్(రేషన్ బియ్యం)ను, వాహనాన్ని సివిల్ సప్లయ్స్ అధికారులు సీజ్ చేసి 6-ఏ కేసును, క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు స్థానిక పోలీసు స్టేషన్ కు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు నాగ వెంకట రాజు, లక్ష్మీనారాయణ, సి.ఎస్.డి.టి కీర్తి, విజయకుమారి, జీవానందం తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురంలో... పొలిటికల్ వ్యూహాలు మారుతున్నాయ్..!

- పవన్‌కళ్యాణ్‌పై అస్త్రాలు సిద్ధం చేస్తున్న అధికార వైయస్సార్సీపి
- స్వతంత్రంగా బరిలో నిలిచేందుకు పావులు కదుపుతున్న వర్మ
- వైయస్సార్సీపీలో ముద్రగడ టెన్షన్...
- ఇరు పార్టీలకు అస్త్రంగా మారిన మాజీ ఎమ్మెల్యే వర్మ



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** కాపుసామాజికవర్గం అధికంగా ఉన్న పిఠాపురం నియోజకవర్గం నుండి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో... ఆ పార్టీ శ్రేణులు నియోజవర్గం నలుమూలల భారీ బైక్ ర్యాలీలు, బాణసంచా కాల్పులు, కేక్ కటింగ్‌లతో సంబరాలు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో 90 వేలకు పైగా కాపు సామాజిక వర్గ ఓట్లు ఉన్నాయని, తమ అధినేత పవన్ కళ్యాణ్‌కి అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని, గెలుపు మాదేనని జనసైనికులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే ఎస్ వి ఎస్ ఎన్ వర్మ అనుచరులు మాత్రం తమ నేతకు సీటు దక్కలేదంటూ కుతకుతలాడిపోతున్నారు.

పిఠాపురంలోపొలిటికల్‌వ్యూహాలుశరవేగంగా మారుతున్నాయి. పవన్‌ను ఓడించేందుకు అధికార వైయస్సార్సీపి నాయకులు తమ వ్యూహాలకు పదును పెడుతూ పలు అస్త్రాలు సిద్ధంచేసుకుంటున్నారు.పిఠాపురం నియోజక వర్గ వైయస్సార్సీపి ఇన్చార్జిగా ప్రస్తుత కాకినాడ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ ఉన్నారు. ఆమె గతంలో 2009 నుండి 2014 వరకుపిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా పని చేశారు. 2019 నుండి ఇప్పటివరకు కాకినాడ ఎంపీగా కొనసాగుతూ...ఎంపీనిధులద్వారా పిఠాపురం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చేపట్టారు. నియోజకవర్గంలో ఆమెకు వున్న పరిచయాలు, ప్రజా సమస్యలపై అవగాహన తమను విజయతీరాలకు చేరుస్తాయని, ప్రస్తుత ఎమ్మెల్యే పెండెం దొరబాబు సైతం సీఎం జగన్మోహన్ రెడ్డి మరొకసారి ముఖ్యమంత్రి చేసేందుకు శ్రమిస్తున్నారని వైఎస్ఆర్సిపి శ్రేణులు అంటున్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని, విజయం తమదేనని వంగా గీతా విశ్వనాథ్ ధీమా చేస్తున్నారు.

**-వైయస్సార్సీపీలో ముద్రగడ టెన్షన్...** సీఎం జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు ఎక్కడో ఒకచోటసీటు కేటాయిస్తారని ప్రచారం జోరుగా సాగుతుంది.ప్రస్తుతానికి పిఠాపురంలో వైఎస్ఆర్సిపి శ్రేణులకు ముద్రగడ టెన్షన్ పట్టుకుంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై పోటీగా... ముద్రగడ పద్మనాభం బరిలో నిలుస్తారన్న ప్రచారం సాగుతుంది. ఈ క్రమంలో నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న వంగ గీతా విశ్వనాథ్ ను తప్పించి... ముద్రగడకు బాధ్యతలు అప్పగిస్తారన్న ప్రచారం జోరుగా ఉంది. అటువంటిదేమీ లేదని పవన్ కళ్యాణ్ పై పోటీకి సరైన వ్యక్తి వంగా గీత విశ్వనాథ్ అని వైఎస్ఆర్సిపి శ్రేణులు అంటున్నారు.

**-ఇరు పార్టీలకు అస్త్రంగా మారిన వర్మ...** టిడిపి, జనసేన,బిజెపి పొత్తులో భాగంగా పిఠాపురం నుండి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తున్నట్లు ఆయనే స్వయంగా ప్రకటించిన క్షణం నుంచి ... మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఆయన అనుచరులురెచ్చిపోయిపసుపు జెండాలను తగలబెట్టారు. 2014లో సైతం తనకు సీటు దక్కకపోవడంతో టిడిపి జెండాలను నడిరోడ్డుపై తగలబెట్టి స్వతంత్రంగా బరిలో దిగి విజయం సాధించారు. 2014లో ఆయన సాధించినది ఆయన సొంత బలంతో కూడుకున్న విజయం కాదని, కన్నీటి సెంటిమెంటుతో విజయం సాధించారన్న అభిప్రాయాలుసర్వత్రావ్యక్తం అవుతున్నాయి. 2014 నాటి సీన్ మరొక్కసారి రిపీట్ అయింది. పవన్ పోటీ అంటూ ప్రకటించడంతో ఆగ్రహంతో ఊగిపోయినవర్మ అనుచరులు తెలుగుదేశం పార్టీ బ్యానర్లు, జెండాలు,ఫోటోలనునడిరోడ్డుపై తగలబెట్టారు. వర్మ సొంతంగాబరిలోనిలిచేందుకు పావులు కదుపుతున్నట్టుతెలుస్తుంది.పిఠాపురంలోపవన్ ఓడించేందుకు... అధికార వైఎస్ఆర్సిపి తెర వెనుక వ్యూహాలు రచిస్తున్నారని, అందుకుమాజీ ఎమ్మెల్యే వర్మను పావుగా వాడుకుంటున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. స్వతంత్ర అభ్యర్థిగా వర్మ పోటీలో నిలిస్తే... కనీసం 15 నుండి 20 వేలఓట్లువరకుసాధిస్తారని,అదే జరిగితే... ఓట్లలో చీలిక ఏర్పడి వైఎస్ఆర్సిపి అభ్యర్థి వంగాగీతకు గంపగుత్తగామేలుజరుగుతుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**-పవన్‌ను అసెంబ్లీకి పంపిస్తామంటున్న జనసైనికులు...** తమ అధినేత పవన్ కళ్యాణ్ ను పిఠాపురం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తామని జనసైనికులు చెబుతున్నారు. ఎవరు ఎన్ని అస్త్రాలు వ్యూహాలు సిద్ధం చేసినా... తాము పిఠాపురంలో బలంగా ఉన్నామని, అందుకే పవన్ కళ్యాణ్ ఇక్కడి నుంచి పోటీలో ఉంటున్నారని, ప్రజా నాయకుడైన పవన్ కు అన్ని సామాజిక వర్గాల ప్రజలు మద్దతు ఉందని జనసేన నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పవన్ కు ఉన్న చరిష్మా, ఓట్ల పరంగా కాపు సామాజిక వర్గ బలం, అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఉన్న పవన్ పిఠాపురంలో సునాయాసంగా విజయం సాధిస్తారని వారంటున్నారు.

# వినియోగదారుల సంఘాల పటిష్టతకు కృషి చేస్తా




- మరొక ఐదు సంవత్సరాలలోఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మానవమేధను అధిగమిస్తుంది
-జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

**పెరవలి, మేజర్ న్యూస్ :** రాబోయే ఐదు సంవత్సరాలు కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనగా కృత్రిమ మేదస్సు మానవ మేధస్సును అధిగమిస్తుందని తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అన్నారు మార్చి 15వ తేదీ శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ వారి ప్రాంగణంలో జిల్లా సివిల్ సప్లై అధికారివారికార్యాలయంలోజరిగినప్రపంచ వినియోగ దారుల దినోత్సవం సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈసందర్భంగాజెసితేజ్ భరత్ మాట్లాడుతూ జిల్లాలోని వినియోగదారుల సంఘాల పటిష్టతకు తాను పూర్తి సహాయసహకారాలుఅందిస్తానని వినియోగ దారుల హక్కుల పరిరక్షణ ధ్యేయంగా స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న కన్యూమర్స్ ఫోరాలు పటిష్టంగా ఉంటేనే వినియోగదారులకు చక్కటి సేవలు లభిస్తాయని ఆయన అన్నారు. “వినియోగదారుల కొరకు న్యాయమైన మరియు బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు” అనే అంశంపై ఆయన సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా సివిల్ సప్లై అధికారి విజయభాస్కర్ జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ రుక్కయ్య లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కమిషనర్.డిస్టిక్ కన్యూమర్స్ కౌన్సిల్ సెక్రెటరీ అనంతరావు తోపాటు జిల్లా లోని వివిధ మండలాల నుండి వినియోగదారుల సంఘాల కన్వీనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెరవలి మండలం వశిష్ట వినియోదారుల సంఘం అధ్యక్షులు సలాది ఉదయభాస్కరరావు మాట్లాడుతూ తూనికలకు కొలతల శాఖకు సంబంధించిన అధికారులు ఆహార తనిఖీ అధికారులు గ్యాస్‌కంపెనీలకుచెందిన అధికారులు గతంలో ప్రతి మండలంలోని వినియోగదారుల సంఘాల కన్వీనర్లను సభ్యులను కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేసేవారు. అందువల్ల మోసాలుచేసే వ్యాపారస్తులు భయపడే వారు కానీ ప్రస్తుతం సిబ్బంది కొరత వల్ల తరచూ అటువంటి తనిఖీలు జరగటం లేదని సభాధ్యక్షులు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ సిబ్బంది కొరత అనే విషయం వాస్తవమేనని దానిని అధిగమించటానికి సచివాలయ సిబ్బందిని కూడా వాడుకొనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని త్వరలో అది కార్యరూపం తాలుస్తుందని ప్రస్తుతం అధికారులు అందరూ ఎన్నికల ఏర్పాట్లలో తలమునకులయ్యారని ఎన్నికల అయిన తర్వాత దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సభలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం వినియోగదారులసంఘాలకుపూర్తిసహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఇంత చక్కగా నిర్వహించిన జిల్లా కన్యూమర్స్ కౌన్సిల్ సెక్రెటరీ అనంతరావును ఇతర అధికారులను అభినందించారు.

## రాబోయే రోజుల్లో జనసేన విజయం తథ్యం

-కందుల దుర్గేష్



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం జనసేన ,తెలుగుదేశం, బిజెపి కార్యకర్తలు పార్టీల ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ జనసేన పార్టీ 11 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మార్చి 14వ తేదీ గురువారం పెరవలి మండలంలో వివిధ గ్రామాలలో పర్యటించారు.ఈ సందర్భంగా పెరవలి మండల జనసేన అధ్యక్షుడు పిప్పర రవి ఆధ్వర్యంలో సుమారు 500 బైక్ లతో పెరవలి మండలం తీపర్రు గ్రామం నుంచి కాపవరం వరకు భారీ బైక్ ర్యాలీతో పెరవలి మండల జనసేన కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తీపర్రు గ్రామంలో ఆ గ్రామ అధ్యక్షుడు పత్తిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో కందుల దుర్గేష్ , బోగవల్లి ప్రసాద్ లు జనసేన జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసినివాళులర్పించారు. తదుపరి కాకరపర్రు, పెరవలి, కాపవరం గ్రామాల్లో జనసేన జెండా ఆవిష్కరించారు. తర్వాత కాపవరంలో జరిగిన భారీ బహిరంగ సభలో కందుల దుర్గేష్ పాల్గొన్నారు ఆ సభకు విచ్చేసిన జనసైనికులు మహిళలు గ్రామస్తులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జన సైనికులు, తెలుగుదేశం ,బిజెపి కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి ఉమ్మడి కూటమి అభ్యర్థి అయిన తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలందరూ తనకు ఒక అవకాశం ఇస్తే నిడదవోలు నియోజకవర్గంలో తన రాజకీయ అనుభవాన్ని ఉపయోగించి అభివృద్ధి చేయటానికి కృషి చేస్తాను అన్నారు. ముఖ్యంగా పెరవలి మండలంలో జనసేన పార్టీ, టీడీపీ పార్టీ చాలా బలంగా ఉన్నాయని, ఈ రెండు పార్టీల కార్యకర్తలు సమిష్టిగా పోరాడితే వైసీపీకి ఇక్కడ డిపాజిట్లు కూడా రావు అన్నారు. వైసిపి నాయకులు తనను నాన్ లోకల్ అంటున్నారని, కానీ నాకు గత 25 సంవత్సరాలుగా నిడదవోలు నియోజకవర్గం తో అవినాభావ సంబంధం ఉందని అన్నారు. నేను వ్యాపారవేత్తను కాదని, పారిశ్రామికవేత్తను కాదని అన్నారు. ఇకనుంచి నిడదవోలు లోనే ఉంటాను నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులోనే ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు రాబోయే రోజుల్లో వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టి ప్రజా ప్రభుత్వం జనసేన తెలుగుదేశం బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామని పిలుపునిచ్చారు. జనసేన రాష్ట్ర నాయకులు భోగవల్లి ప్రసాద్ మాట్లాడుతూ దుర్గేష్ ను భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికిన పెరవలి మండల అధ్యక్షుడు పిప్పర రవిని, పెరవలి మండల జనసేన నాయకులకు, కార్యకర్తలకి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ప్రియ సౌజన్య, పెరవలి మండల జనసేన పార్టీ అధ్యక్షులు పిప్పర రవి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు నందిప శ్రీనివాస చక్రవర్తి,జిల్లా కార్యదర్శి తులా చినబాబు, బీసీ నాయకులు పాల వీరస్వామి నిడదవోలు పట్టణ జనసేన అధ్యక్షులు రంగా రమేష్ మాజీ మండల పరిషత్ అధ్యక్షులు కోటిపల్లి మురళికృష్ణ వీరవల్లి శ్రీనివాస్, రేలంగి రాజేష్, ఓదురి నరసింహస్వామి సంగీత నాగు, పులిదిండి నాగరాజు, పొప్పోప్పు శ్రీను, శివ,నాని,నవీన్, పెరవలి మండలం ఎంపీటీసీలు, జిల్లా కార్యవర్గ సభ్యులు నిడదవోలు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.


# బియ్యం సకాలంలో సరఫరా చేయాలి

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని తెల్ల రేషన్ కార్డుదారులకు, పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం సకాలంలో సరఫరా చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం సమావేశం హాలు నుండి తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ పంపిణీ, వివిధ ఆశ్రమ పాఠశాలలకు, మధ్యాహ్న భోజన పథకంనకు సంబంధించిన పాఠశాలలకు రేషన్ బియ్యం సరఫరా,అంగన్వాడీ కేంద్రాలకు సకాలంలో రేషన్ బియ్యం సరఫరా చేయుట గురించి గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, జిసిసి డిఎం, జిసిసి యస్ యం లు, డివిజనల్ సివిల్ సప్లై అధికారి, మండల విద్యాశాఖ అధికారులు, అన్ని మండలాల తాసిల్దారులు, డిప్యూటీ తాసిల్దార్లుతో సమావేశం నిర్వహించారు. అలాగే మరికొంతమంది అధికారులతో ప్రాజెక్ట్ అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అన్ని మండలాలలో ప్రతీ నెల ఒకటో తేదీ నుండి 17వ తేదీ వరకు తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎండియు వాహనాల ద్వారా సకాలంలో రేషన్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఒక్కొక్క మండలంలో మండల స్థాయి స్టాక్ పాయింట్లు ఎన్ని ఉన్నాయి, అదేవిధంగా ఒక్కొక్క మండలానికి ఎన్ని మెట్రిక్ టన్నులు రేషన్ బియ్యం వస్తున్నాయి ఆయన ఆరా తీశారు. ఒక్కొక్క మండలంలో ఎన్ని రేషన్ షాపులు ఉన్నాయి, అదేవిధంగా ఒక్కొక్క మండలంలో ఎన్ని తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి, ఇప్పటివరకు ఎంతమందికి రేషన్ సరఫరా చేసింది, ఇంకా ఎన్ని మెట్రిక్ టన్నులు బియ్యం నిల్వ ఉన్నది, ఎంత ఖర్చయింది ఆయన ఆరా తీశారు. గత నెలలో ఎన్ని టన్నులు రేషన్ బియ్యం వచ్చింది ఎంతమందికి సరఫరా చేసింది ఇంకా ఎంత రేషన్ ఉన్నది ఆయన ఆరా తీశారు, ఏజెన్సీలో అన్ని ఆశ్రమ పాఠశాలలకు అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పాఠశాలలు ఎన్ని ఉన్నాయి, ప్రతీనెల ఎంత రేషన్ కావలసి ఉన్నది ఆయన ఆరా తీశారు. అదేవిధంగా ఒక్కొక్క మండలంలో ఎన్ని స్కూల్స్ ఉన్నాయి ఆయన ఆరా తీశారు. ఎండియు వాహనదారులు సరిగా రేషన్ సప్లై చేయకపోతే అటువంటివారిపై చర్యలు తీసుకోవాలని తాసిల్దారులను ఆయన ఆదేశించారు. ప్రతీ నెల రేషన్ బియ్యం సరఫరాకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. తాసిల్దారులు, సివిల్ సప్లై అధికారులు, జిసిసి అధికారులు, డిప్యూటీ తాసిల్దారులు కోఆర్డినేషన్‌తో ప్రతీ నెలా ఆశ్రమ పాఠశాలలకు, మధ్యాహ్న భోజన పథకం స్కూళ్లకు, అంగన్వాడి కేంద్రాలకు, తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో రేషన్ సరఫరా చేయాలని, అదేవిధంగా ఏమైనా సమస్యలో ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈసమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. అబుసలాం, జిసిసి డిఎం జి.పార్వతీశ్వరరావు, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి.శ్రీహరి,ఏజెన్సీ డీఈవోమల్లేశ్వరరావు, తాసిల్దార్లు ఎ. కృష్ణ జ్యోతి, ఏవి. రమణ, ఎటీ డబ్ల్యూ ఓ.రామ తులసి, జిసిసి ఎస్ఎం ముళ్ల నాగ వెంకట రాజారెడ్డి, సిడిపిఓ సంధ్యారాణి, డిప్యూటీ తాసిల్దార్ రామకృష్ణ, అన్ని మండలాలకు సంబంధించిన తాసిల్దారులు, డిప్యూటీ తాసిల్దార్లు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## రు.2.53 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం శంకుస్థాపన చేసిన మంత్రి వేణుగోపాలకృష్ణ



**కడియం, మేజర్‌న్యూస్ :** పాలన సంస్కరణలో వ్యవస్థీకృత మార్పులను తీసుకురావడం వలన పేదవాడు పేదరికంపై జయించి ఆర్థికంగా బలోపేతం చెందుతాడనే సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని జిల్లా ఇన్చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం కడియం మండలంలో రు. 2.53 కోట్ల రూపాయలతో వెంకాయమ్మ పేట, కడియపులంక, దోసాలమ్మ కాలనీ, జేగురుపాడు, మురగొండ గ్రామాలలో మంత్రి వేణుగోపాలకృష్ణ స్థానిక నాయకులు అధికారులతో కలిసి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజా అవసరాలను గుర్తించి వాటిని అమలు చేసే క్రమంలో పారదర్శకతతో ప్రామాణికంగా తీసుకొని సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లను ఈ గ్రామాల్లోనే అందుబాటులో ఉంచడం జరిగింది అన్నారు నేడు రాజమండ్రి రూరల్ నియోజకవర్గం కడియం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 2.53 కోట్ల రూపాయలతో పలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపన చేయడం జరిగిందని పేర్కొన్నారు. పాలన సంస్కరణలో వ్యవస్థీకృత మార్పులను తీసుకురావడం వలన పేదవాడు పేదరికంపై జయించి ఆర్థికంగా బలోపేతం చెందుతాడు అనే సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి సీఎం జగన్మోహన్ రెడ్డి అని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా కష్టాల్లో, పేదరికంలో, వివక్షత లోనైన ప్రతి ఒక్కరికి సముచిత స్థానాన్ని కల్పించి చిత్తశుద్ధితో రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వ ఫలాలను సీఎం జగన్మోహన్ రెడ్డి అంకితభావంతో అందజేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

-వివిధ అభివృద్ధి కార్యక్రమాల వివరాలు : వెంకాయమ్మ పేట గ్రామంలో రు.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రు.20.80లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్, రు.40 లక్షలతో గ్రామ సచివాలయం, కడియపులంకలో రు.40 లక్షలతో గ్రామ సచివాలయం, దోసాలమ్మ కాలనీలో రు.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, మురమండ గ్రామంలో 23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రు. 60 లక్షల రూపాయలతో పాఠశాల అదనపు తరగతి గది ప్రారంభించుకున్నామని,అదేవిధంగా జేగురుపాడు గ్రామంలో రూడా నిధులు రు.25 లక్షలతో మల్టీపర్పస్ యాక్టివిటీస్ సెంటర్ ను శంకుస్థాపన చేయడం జరిగిందని మంత్రి వేణుగోపాలకృష్ణ తెలిపారు. అనంతరం మంత్రి వేణుగోపాలకృష్ణ రాజమండ్రి రూరల్ మండలం బొమ్మూరు బాలాజీ పేట నవభారత్ నగర్ లో గల పార్కులో రు.11.60 లక్షల రుడా నిధులతో పిల్లల ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్ పనులను శంకుస్థాపన చేసి ప్రారంభించుకున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి వెంట మండల సహకార సొసైటీ అధ్యక్షులు, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఈలి గోపాలం, జై గురు పాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, కడియం ఎంపీడీవో జి రాజు మనోజ్, రాజమండ్రి రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పి ఆర్ ఎ ఈ లు సిహెచ్ త్రిమూర్తులు, సంపత్‌కుమార్,మండల వ్యవసాయాధికారి కే ద్వారక దేవి, స్థానిక నాయకులు కొత్తపల్లి శివాజీ ఊటుకూరు శైలజ, దాసరి శ్రీను, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోనసీమ తిరుపతిలో పిఆర్ఓ కార్యాలయం ఏర్పాటు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం పిఆర్ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆలయం మాడవీధులలో ఉత్తర రాజగోపురం ద్వారం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పిఆర్ఓ పబ్లిక్ రిలేషన్ ఆఫీస్ కార్యాలయాన్ని శుక్రవారం ఉప కమిషనర్ భూపతిరాజు వెంకట సత్య నాగ కిషోర్ కుమార్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు పిఆర్ఓ కార్యాలయం ద్వారా సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్రేయపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

- పాల్గొన్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల కేంద్రం ఆత్రేయపురంలో శుక్రవారం ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిం చారు. గ్రామంలో తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఏమైనా సమస్యలు ఉన్నాయని తెలుసుకున్నారు. అనంతరం రావిచెట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలుతో పేద మధ్య తరగతి వర్గాల వారు వైసీపీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జెనసేన బీజేపీ పార్టీల అనైతిక పొత్తును ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. రావులపాలెంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బండారు సోదరులు స్థాయికి మించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని విమర్శించారని, స్థాయికి మించి విమర్శలు చేయడం తగదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండా అన్నపూర్ణ, జడ్పిటిసి బోనం సాయి బాబా, మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, రాష్ట్ర ఔట్సోర్సింగ్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, నాయకులు ముదునూరి రామరాజు, కృష్ణంరాజు, చిలువూరి రామకృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

## కోనసీమ తిరుపతిలో స్వర్ణ శిఖర ప్రతిష్ట మహోత్సవాలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజులపాటు స్వర్ణ శిఖర ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు వెంకట సత్య నాగ కిషోర్ కుమార్ తెలిపారు. వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంనందు శని,ఆదివారాల్లో రెండు రోజులపాటు జరిగే ఉత్స వాల్లో శ్రీ వెంకటేశ్వర స్వామివారి క్షేత్రపాలకుడు శ్రీ వేణుగో పాలస్వామి స్వర్ణ శిఖర ప్రతిష్ట మహోత్సవము అత్యంత వైభవంగా నిర్వహించ నున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారి, అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ధర్మకర్తల మండల సభ్యులు, డిప్యూటీ కమిషనర్ కోరారు.

## శబరి నదిలో ఒక్కసారిగా తగ్గిన నీటి మట్టం

### -పిల్ల కాలువను తలపిస్తున్న శబరి నది



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** ఒక్కసారిగా జీవనదైన శబరిలో నీటి మట్టం గణనీయంగా తగ్గి చూపరులను ఆశ్చర్యానికి గురిచేసింది.ఇప్పుడే మార్చి నెలలో ఈవిధంగా నీళ్ళులేక వెలవెల పోతే ఏట్లాని ప్రకృతి ప్రేమికులు,మండల ప్రజలు విస్తుపోతున్నారు. ఏప్రిల్ ఉంది మేనెల రావాలి కనీవినీఎరుగని రీతిలో శబరిలో నీళ్లు అడుగంట్టి పిల్ల కాలువను తపిస్తోంది. ఏది ఏమైనా గత 10 రోజులుగా "ఇటు శబరి",అటు గోదావరి"పూర్తిగా నీటి నిల్వలు తగ్గి ఇక్కడి వాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. గతంలోఎప్పుడూ శబరినది ఈవిధంగా జీవకలను కోల్పోయి పిల్ల కాలువగా మారడం ఈమధ్యకాలంలో ఎన్నడూ చూడలేదని,కూనవరం,వరరామచంద్రాపురం, మండలప్రజలు "మేజర్ న్యూస్" ముందు వాపోయారు.

# నియోజకవర్గంలో 'తెలుగుదేశం' విజయం ఖాయం

### - పార్టీ అభ్యర్థి మిరియాల శిరీష దేవి



**రంపచోడవరం,మేజర్న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ అనంత బాబు అక్రమాలు అరికట్టాలంటే తెలుగుదేశం పార్టీ జెండా రంపచోడవరం నియోజకవర్గంలో ఎగరాలని, దానికి తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమిలోని ప్రతీ నాయకుడు, కార్యకర్తలు నియోజకవర్గం ప్రజలు తెలుగుదేశం పార్టీ విజయానికి సహకరించాలని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మిరియాల శిరీష దేవి విజ్ఞప్తి చేశారు.ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన తనకు రంపచోడవరం నియోజకవర్గం టిడిపి సీటు కేటాయించిన టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు, నారా లోకేష్కు, రాష్ట్ర టిడిపి అధ్యక్షులు అచ్చెంనాయుడుకి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్కు, బిజెపి నాయకులకు మిరియాల శిరీష దేవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం రంపచోడవరంలోని కళ్యాణ మండపంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంపచోడవరం నియోజకవర్గం నూతన అబ్జర్వర్ చెల్లుబోయిన శ్రీనివాస్, ఉమ్మడి టిడిపి అభ్యర్థి శిరీష దేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిరియాల శిరీషదేవి మాట్లాడుతూ తాను అంగన్వాడి వర్కర్గా సుమారు 8 సంవత్సరాలపాటు పనిచేశానని, ఆ సమయంలో తన భర్త మఠం భాస్కర్ రంపచోడవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడిగా పనిచేసేవారని, అతనిపై ఉన్న కోపంతో ఎమ్మెల్సీ అనంతబాబు అంగన్వాడీ వర్కర్గా పనిచేస్తున్న తనపై వేధింపులకు పాల్పడ్డారని, వారి వేధింపులు భరించలేక ఉద్యోగాన్ని వదిలి తన భర్తతోపాటు పార్టీలో జరిగే కార్యక్రమాల్లో తిరిగానని, ఇటీవల కుటుంబసభ్యులు ఇచ్చిన ప్రోత్సాహంతో రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు తెలుగుదేశం పార్టీ అధిష్టానంకు దరఖాస్తు చేయడం జరిగిందని తెలిపారు. తన దరఖాస్తు పరిశీలించిన అధిష్టానం బిజెపి, టిడిపి, జనసేన కూటమి ఉమ్మడి అభ్యర్థిగా తనను ప్రకటించారని శిరీషాదేవి తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలో అనంత బాబు అక్రమాలు అరికట్టాలంటే టిడిపి జెండా రంపచోడవరం నియోజకవర్గంలో ఎగరాలని, దానికి కూటమిలోని ప్రతి నాయకుడు, కార్యకర్తలు, నియోజకవర్గం ప్రజలు తెలుగుదేశం పార్టీ విజయానికి సహకరించాలని కోరారు. అనంతబాబు రంపచోడవరం నియోజకవర్గంలో నామమాత్రంగా ఎమ్మెల్యేను గెలిపించి, వారిని అడ్డుపెట్టుకుని ఇక్కడ అభివృద్ధికి వచ్చిన కోట్ల రూపాయల నిధులను కాజేస్తున్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లో నియోజకవర్గం ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. అనంతరం రంపచోడవరం నియోజకవర్గం నూతన అబ్జర్వర్ చెల్లుబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో టిడిపి సీటు శిరీషదేవికి ప్రకటించడంతో అక్కడక్కడ కొద్దిపాటి అసంతృప్తులు ఉన్నాయని, వారు తమతో మాట్లాడి వాటిని సరిచేసుకోవాలని, అలాగే అధిష్టానం ఇచ్చిన ఆదేశాలు మేరకు పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన అభ్యర్థిని గెలిపించడమే ధ్యేయంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం టిడిపి మండల అధ్యక్షులు బుజ్జి, గంగవరం మండల అధ్యక్షులు అర్జున్, టిడిపి రంపచోడవరం మాజీ అధ్యక్షులు అడబాల బాపిరాజు, జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు కాకి స్వామి, రంపచోడవరం టిడిపి జనసేన పార్టీల సమన్వయకర్త కుర్ల రాజశేఖర్ రెడ్డి, రంపచోడవరం మండల జనసేన అధ్యక్షులు పి.శ్రీనివాస్, 11 మండలాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

### -డాక్టర్ బిఈవీఎల్ నాయుడు



**కాకినాడ,మేజర్న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వినియోగదారుల హక్కుల చట్టం పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ కొనుగోలు, అమ్మకాలు, వస్తు ఉత్పత్తి, వినిమయం వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, డిజిటల్ మార్కెటింగ్, ఆన్లైన్ కొనుగోలు ప్రక్రియ ఎక్కువైన తరుణంలో కొనుగోలుదారుడు తన హక్కుల గురించి, పరిరక్షణ కొరకు ఉన్న చట్టాల గురించి తెలుసుకోవాలని అన్నారు. వినియోగదారుడి పరిరక్షణ కోసం ప్రభుత్వం చేస్తున్న చట్టాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని తెలిపారు. ఉత్పత్తిదారులు నాణ్యమైన, నమ్మకమైన సరుకును వినియోగదారుడికి అందించినప్పుడేనిజమైనన్యాయం జరుగుతు ందని అన్నారు. ప్రతి పౌరుడు ఈ విధమైన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, గ్రూప్ డిస్కషన్ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలను మరియు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కామర్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్చార్జి మూర్తి, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ అలీ,నరసింహారావు తదితర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## చిరు సహాయం

### -జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు




**వి.ఆర్.పురం,మేజర్ న్యూస్ :** ఉపవాసదీక్షలు చేస్తున్న పేద,మధ్యతరగతి, ముస్లిం కుటుంబాలకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు ,జమాల్ ఖాన్,స్పష్టం చేశారు. శుక్రవారం కూనవరం, మండలంలోని కూనవరం, భీమవరం,టేకుల బోరు, గ్రామాలకు మరియు వరరామచంద్రా పురం, మండలం లోని కుటుంబాలకు, ఒక్కోక్క కుటుంబానికి 10 కేజీలు బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, ఉప్పు, మంచి నూనె ప్యాకెట్, కారం, నిత్యవసర వస్తువులను అందజేశారు. కూనవరం మండలంలో 60 కుటుంబాలకు,వరరామచంద్రా పురంలోని 10 కుటుంబాలకు, ఇదే తరహాలో రంజాన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ మాట్లాడుతూ! రంజాన్ ఉపవాస దీక్షలుఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంటాయని, పేదవారి ఆకలి దప్పులను,తెలుపుతూ! ధనిక వర్గాల వారికి అవగాహన కలిగిస్తూ అల్లా సన్నిధికి తోడ్పడేలా ఉంటాయన్నారు. రోజూ వారి పనులు చేసుకొని కష్టపడే శ్రామికులు ఉపవాస దీక్షలు చేయటం కొంత వరకు ఇబ్బందులు ఉంటాయని సమస్యను దృష్టి లో పెట్టుకొని, తనవంతు ఈచిరుసహాయం అందిస్తున్నామని జమాళ్ ఖాన్ తెలిపారు.తనకు కలిగిన దానిలో నుండి పొరుగు వారికి ఎంతో కొంత సాయం చేయాలని, అనుకోవడం ఆ అల్లా!ఇచ్చిన వరంగా భావిస్తున్నానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో వరరామచంద్రాపురం గ్రామ పెద్దలు సర్ఫారాజ్,ముస్లిం కమిటీ సభ్యులు,మరియు కూనవరం మజ్ జిద్, కమిటీ వారు సూఫీ.షరీఫ్ ,రజాక్ తదితరులు పాల్గోన్నారు.

## జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి ఒడిస్సా జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. యువతలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు, జాతీయ సమైక్యతా భావాలను పెంపొందించడానికి, విద్యార్థులు ఇతర ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వ యువజన మరియు క్రీడల మంత్రిత్వ శాఖ విభాగంలో ఉన్న జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత శిబిరాలను నిర్వహిస్తారు. ఒడిస్సా ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి 22 వరకు బాలాసోర్ లో గల ర ఫకీర్ మోహన్ యూనివర్సిటీ లో 7 రోజుల పాటు జాతీయ సమైక్యతా శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుండి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. భాష, సాంస్కృతిక అంశాలలో ప్రతిభ కనపరిచిన ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం శ్రీ కళ్యాణ్ ఈ శిబిరానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు విద్యార్థిని అభినందించి మాట్లాడుతూ శిబిరంలో రిసోర్స్ పర్సన్స్ చెప్పిన అంశాలను శ్రద్ధగా విని ఆకలింపు చేసుకోవాలని అన్నారు. ఈ విధమైన కార్యక్రమాల వలన భావ వినిమయం తోపాటు, జాతీయ భావాలను పెంపొందించుకోవచ్చునని, శిబిరం యొక్క ప్రధాన ఉద్దేశ్యాన్ని గ్రహించి తద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, దివాకర రావు మాట్లాడుతూ తమ విద్యార్థిని జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక చేసిన నన్నయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వై శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు.జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన శ్రీ కళ్యాణ్ ను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇంచార్జి ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు,దివాకర రావు మరియు అధ్యాపకులు అభినందించారు.

## ప్రయాణీకులు తప్పని తిప్పలు-హామీలు గాలికి




**వి.ఆర్.పురం, మేజర్న్యూస్ :** ప్రయాణికులకు తప్పని తిప్పలు, అవసరానికి బస్లు ఉండవు ,జిల్లా కేంద్రానికి బస్ సౌకర్యం లేదు. గతంలో (రాజధాని) విజయవాడకు బస్ సౌకర్యం ఉండేది,కానీ ప్రస్తుతం అదీలేదు. "ఆరంభ సూరత్వం" జిల్లాకు బస్ ఏర్పాటు చేశారు.అధీకుడా మునాళ్ళముచ్చటే మళ్లీ తీచేశారు.కారణం తెలియదు ముఖ్యంగా మధ్యాహ్నం వరరామచంద్రాపురం,మండలకేంద్రం నుండి ,రాజమహేంద్రవరం, వెళ్లడానికి, మళ్లీ సాయంత్రం రాజమహేంద్ర వరం,వెళ్ళడానికి,వరరామచంద్రాపురం నుండి బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజల కోరుతున్నారు.ఆలాగే విజయవాడకు గతంలో ఉన్నట్లే రాత్రి 8 గంటలకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు బస్ సౌకర్యం ఏర్పాటుచేస్తే, సౌకర్యవంతంగా ఉంటుందని, విలీనమండలాల ప్రజలు కోరుతున్నారు. ఆదాయం ఉన్న రూట్లలో బస్ సౌకర్యం ఉండదు,బస్ సౌకర్యం ఉన్నచోట ఆదాయం శూన్యం,ఆర్టీసీ అధికారులు పరిశీలించి వీలైనంత త్వరగా బస్ సౌకర్యం కల్పించాలని ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు. విద్యార్థులకు చదువుల కోసం వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.ఈప్రాంతం నుండి వ్యాపారస్తులకు, విద్యానీవిద్యార్థులకు, గుంటూరు మిర్చి యార్డు కు వెళ్లాలంటే రైతులకు!విజయవాడ బస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. విలీన మండలమైన వరరామచంద్రాపురం,వాసులకుబస్లుసక్రమంగా లేఖ ఇబ్బందులు పడుతున్నారు. ఆర్.టి.సి.అధికారులు స్పందించి పరిశీలించి వీలైనంత త్వరగా బస్లు ఏర్పాటుచేయాలని సూచిస్తున్నారు. ఈవరరామచంద్రాపురం, మండల కేంద్రానికి సుమారుగా 70 గ్రాములు ఉన్నాయి.టైం ప్రకారం బస్ లను ఆర్.టి.సి.అధికారులు నడపగలిగితే ఆర్.టి.సి.కి లాభాలతో పాటు,ఇక్కడ ప్రజల అవసరాలు తీరుతాయనిసంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

## మార్చి 17 వ తేదీన జిల్లాలో గ్రూప్ వన్ పరిక్షలకు హాజరు కానున్న

# 8 వేల 258 మంది అభ్యర్థులు

- -జిల్లాలో ఏపీపిఎస్సి గ్రూప్ -1 పరీక్షలకు 25 కేంద్రాలు
- -పరీక్షా కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాట్లు చెయ్యాలి
- - మొదటి పరీక్ష ఉదయం 10.00 నుంచి మ 12.00 వరకు -రెండో పేపర్ మ.2 నుంచి సా.4 వరకు
- -పరీక్షా కేంద్రాలలోనికి గంట ముందు నుంచి అనుమతించడం జరుగును- జేసి తేజ్ భరత్

**రాజమహేంద్రవరం,మేజర్ న్యూస్ :** జిల్లా పరిధిలో మార్చి 17 వ తేదీ ఆదివారం 25 పరీక్షా కేంద్రాలలో ఏపిపిఎస్సి గ్రూప్ 1 పరీక్షలు అత్యంత పకడ్బందీ గా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని ఏపీపి ఎస్సి నోడల్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ అన్నారు. సోమవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్ 1 పరిక్షల నిర్వహణ నేపథ్యంలో గ్రూప్ వన్ పరీక్షల నిర్వహణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ, మార్చి 17 వ తేదీ ఆదివారం తూర్పు గోదావరీ జిల్లా పరిధిలోని 25 పరీక్షా కేంద్రాలలో గ్రూప్ 1 ఎపిపిఎస్సి పరీక్షల నిర్వహణా కోసం అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ సర్వీసులల్లో గ్రూప్ వన్ పరీక్షలు అత్యంత ప్రాధా న్యత కలిగిన పరీక్షగా పేర్కొన్నారు. పరీక్షలకు సంసిద్ధం అయిన అభ్యర్థులు అధిక శాతం హాజరు కానున్న ట్లు తెలిపారు. ఆయా కేంద్రాలలో హాజరయ్యే అభ్యర్థులకు అను గుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్, త్రాగునీటి, తది తర కనీస అవసరాలు, మెడిక ల్ క్యాంపులు అందుబాటులో ఉంచడం జరిగిందని స్పష్టం చేశారు. ఉదయం పేపర్ 1 పరిక్ష ఉదయం 10.00 నుంచి మ.12.00 గంటల వరకు, మధ్యహ్నం పేపర్ 2 పరీక్ష మ.2.00 గంటల నుంచి సా.4.00 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలలోనికి ఆయా కేంద్రాల కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు , ఇన్విజిలేటర్లు , రూట్ ఆఫీసర్లు , లైజన్ ఆఫీసర్లు , పరిశీలకులు తగిన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు భద్రపరిచేందుకి తగిన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఆర్టిసి, రవాణా శాఖ అధికా రులు ఆయా రూట్లలో బస్సు లు, ఆటోలని అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాల న్నారు. ప్రతీ కేంద్రం వద్ద మెడి కల్ క్యాంపు ఉంచాలన్నారు. 25 కాలేజీల్లో 25 జిల్లా స్థాయి అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చెయ్యాలని , పగడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు ఒక్క పెన్ను తప్ప ఏమి తీసుకు రాకుండా జాగ్రత్త తీసుకోవాలని కాలేజి యాజమాన్యాలను, అధికారులను, పోలీసులను ఆదేశించారు. పరీక్షలు నిర్వహించడానికి 25 కాలేజీల్లో 353 రూములు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు , నిరంతర విద్యుత్ , ఇతర అనుబంధ ఏర్పాట్లు చేయాలన్నారు. -అభ్యర్థులకు సూచనలు: పేపర్ -1 పరీక్ష ఉదయం 10.00 నుండి మద్యాహ్నం 12.00 వరకు నిర్వహిస్తామని, అభ్యర్థులను పరీక్షా కేంద్రములోనికి ఉదయం 9.00 నుండి 9.45 వరకు అభ్యరులను అనుమతించబడును. ఉ.9.45 గంటల తరువాత పరీక్ష హాలు లోనికి అభ్యర్ధులను అనుమతించడం జరుగదు. పేపర్ -2 పరీక్ష మ.2.00 నుండి 4.00 వరకు జరుగును. అభ్యర్థులను పరీక్షా కేంద్రములోనికి మ.1.00 నుండి 1.45 వరకు అభ్యరులను అనుమతించబడును. మ.1.45 గంటల తరువాత పరీక్ష హాలు లోనికి అభ్యర్ధులను అనుమతించడం జరుగదు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటుగా ఒక ఒరిజినల్ ఫోటో (పాస్ పోర్టు, పాన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, ప్రభుత్వ గుర్తకింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు) తో హాజరు కావలెను. హాల్ టికెట్ నందు ఫోటో లేక పోయినా, ఫోటో సరిగా లేని అభ్యర్థులు గెజిటెడ్ అధికారి సంతకముతో 3 పాస్ పోర్ట్ సైజు కలర్ ఫోటో లతో హాజరు కావలెను. పరీక్షా కేంద్రము లోపలకు సెల్ ఫోన్లు, కాలిక్యులేటర్, స్మార్ట్ వాచ్ లతో పాటు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరములు అనుమతించబడవు. ఈ సమావేశంలోనే డి ఆర్వో జి. నరసింహులు, అదనపు ఎస్పీ పి. అనిల్ కుమార్ , ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ సందు సాయి ప్రకాష్, సెక్షన్ ఆఫీసర్ పీ. దిల్లేశ్వరరావు , కాలేజి ప్రిన్సిపల్స్, ప్రతినిథులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## ప్రజలకు తాగునీరు అందించడమే మా లక్ష్యం

### -ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలిమండలం కానూరు అగ్రహారం గ్రామంలో మార్చి 15వ తేదీ శుక్రవారం రూ.73.00 లక్షల వ్యయంతో పూర్తి చేసిన మంచినీటి ట్యాంక్, పైపులైన్, బోరు ను నిడదవోలు శాసనసభ్యులు శ్రీనివాస్ నాయుడు ప్రారంభి ంచారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ ప్రతి ఒక్కరికి మంచి నీళ్లు అందించడమే తన ధ్యేయమని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు తో పాటు గ్రామ సర్పంచ్ దాసం వెంకన్న పెరవలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కార్చేర్ల సీతారాం ప్రసాద్ మండల వైసీపీ పార్టీ అధ్యక్షులు వీరమల్ల సత్యనారాయణ దాసం బాపన్న నాయుడు కరిసినపు సూర్యారావు వరసాల సామేలు సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు మరియు మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కుల పంపిణీ



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** పెద్దాపురం నియోజక వర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు అయిన చెక్కులను శుక్రవారం పెద్దాపురం నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు సామర్లకోట వైసిపి క్యాంపు కార్యాలయంలో 32 కుటుంబాలకు 16.48 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ అనారోగ్య బారిన పడి వేరు వేరు ప్రైవేటు ఆసుపత్రిలలో చికిత్స తీసుకోవడం జరిగిందని వైద్యచికిత్స కోసం వారు ఖర్చు చేసిన మొత్తములో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడం చేసుకోవడంతో సీఎం సహాయ నిధి నుండి బాధితులకు మొత్తం 16.48 లక్షలు రూపాయలు మంజూరు కాగా లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు.


# వాటర్ వర్క్స్ సిబ్బందిపై తేనెటీగల దాడి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పట్టణ ప్రజలకు రక్షిత త్రాగునీరు అందించే పిల్టర్ బెడ్ నందు పనిచేస్తున్న సిబ్బందిపై తేనెటీగలు దాడి చేసాయి. ఈ దాడిలో అక్కడ పనిచేస్తున్న నలుగురు సిబ్బందికి గాయాలు కావడంతో వారిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. భాదితులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం పట్టణ ప్రజలకు సరఫరా జరిగే త్రాగునీటి పైప్ లైన్ లో అంతరాయం ఎర్పడటంతో దానిని సరిచేసే నిమిత్తం వాటర్ వర్క్స్ ఇన్చార్జి గిడుతూరి శ్రీనువాసరావు తో పాటు ఎన్. రత్నరాజు, కె సత్యనారాయణ, రొట్టా ప్రసాద్ లపై తేనెటీగలు దాడి చేసాయి. తీవ్ర అశ్వస్థతకు గురైన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రులను మునిసిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, మునిసిపల్ కౌన్సిలర్ నేతల హరిబాబు, వైఎస్సార్సీపీ నాయకులు గంగిరెడ్డి కృష్ణ మూర్తి, మునిసిపల్ అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పరామర్శించారు. కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆంధ్రాలో టిడిపి-జనసేన-బిజెపి కూటమి భారీ విజయం ఖాయం

- జగన్ రెడ్డి పాలనలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం
- ప్రజల్లో జగన్ పాలనపై తీవ్ర వ్యతిరేకత - జ్యోతుల నవీన్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం-జనసేన-బిజెపి కూటమి అత్యధిక సీట్లు గెలిచి భారీ విజయం సాధించబోతోందని ఆంధ్రాలో ఈ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది అని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గడిచిన 4 సంవత్సరాల 10 నెలల కాలంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయని, ఏవర్గం వారు కూడా సంతోషంగా లేరని అతని పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఇదే విషయాన్ని జాతీయ సర్వే సంస్థలు చేపడుతున్న సర్వేల్లో తేటతెల్లమవుతోందన్నారు. ఇటీవల న్యూస్18 మెగా సర్వేలో అలాగే ఎబిపి- సి ఓటర్ సర్వేల్లో అత్యధికంగా 20కి పైగా లోక్ సభ స్థానాలను టిడిపి బిజెపి జనసేన కూటమి గెలుచుకోబోతున్నాయని తేల్చి చెప్పడం జగన్ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని అన్నారు. గ్రూప్1 పరీక్షల విషయంలో జరిగిన అవినీతి అక్రమాలు తీరు చూస్తుంటే అవినీతి అక్రమాల అడ్డా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంగా చెప్పవచ్చని నవీన్ అన్నారు.

## పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి..



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** ఈనెల 18 వ తారీఖు నుండి మొదలయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎమ్.హరి ప్రసాద్ తెలిపారు.మండలంలో 940 మంది రెగ్యులర్ విద్యార్థులు,111 మంది ప్రైవేట్ విద్యార్థులు మొత్తం 1051 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారని తెలిపారు.మండలంలోని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల్లో 230 మంది,ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు 240 మంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నందు 229 మంది, చప్పిడివారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 157 మంది, వానపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 155 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశారు.ఈ నెల 18 నుండి 27 వరకు ఉదయం 9.30 నుండి12.45 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సూచించారు. దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు మీ హాల్ టికెట్ చూపి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యము వినియోగించుకోవచ్చని విద్యాశాఖ అధికారి అన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన మేడిది రమేష్ (36) కూలీ చేసుకుని జీవిస్తూ, మద్యానికి అలవాటు పడి తన భార్యతో తరచూ గొడవలు పడేవాడు. దీంతో తన భార్య సుమారు 15 రోజుల క్రితం తన పుట్టింటికి వాడపల్లి గ్రామం వెళ్ళిపోయినది. భార్యను కాపురానికి రమ్మని అడగగా రాకపోయేసరికి మనస్తాపం చెంది ఈ నెల 11న తన ఇంటికి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న గేదెలపాక వద్ద పురుగుల మందు తాగాడు. తన అన్న మేడిద వెంకటరావుకి తెలిసి చికిత్స నిమిత్తం రావులపాలెం అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 14న మృతి చెందాడు. అన్న ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎస్.శ్రీనివాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### - ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు చేసి, మెరుగైన వైద్యసేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే వైద్యాధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతంలో దుప్పులపాలెం, చవిటి దిబ్బలు, వాడపల్లి, కుసుమరాయి, తుంగమడుగుల గ్రామాలలో గోకులం ద్వారా ఏర్పాటు చేస్తున్న పశువుల షెడ్ పనులను శుక్రవారం ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. దుప్పలపాలెం, చవిటి దిబ్బలు, వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు ఏ విధంగా వైద్య సేవలు అందిస్తున్నారో ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కావాల్సిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు ఎంతమంది ఉన్నది , సిబ్బంది ఎంతమంది ఉన్నది అదేవిధంగా రోగులకు సంబంధించిన రక్త పరీక్షలు ఏవిధంగా చేస్తున్నారు, అదేవిధంగా రిజిస్టర్లను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది, అదేవిధంగా ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ని డెలివరీలు చేసింది, అదేవిధంగా ప్రమాదకర గర్భిణీ స్త్రీలను ఎంతమందిని గుర్తించింది వివరాలు సంబంధిత వైద్యాధికారులను, సిబ్బందిని పిఓ అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం గోకులం పథకం ద్వారా నిర్మిస్తున్న పశువుల షెడ్లను కుసుమరాయి గ్రామంలో రెండు, తుంగమడుగుల గ్రామంలో ఒకటి తనిఖీ చేశారు. అదేవిధంగా ఒక్కొక్క కాటిల్ షెడ్ విలువ 22 లక్షల రూపాయల వ్యయంతో ఒక్కొక్క షెడ్‌లో 20 గేదెలు ఉండే విధంగా ఈ క్యాటిల్ షెడ్లను నిర్మిస్తున్నామని, అదేవిధంగా క్యాటిల్ షెడ్ల పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత ఇంజనీర్లను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రాజెక్ట్ అధికారి వెంట గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. డేవిడ్ రాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక శానిటేషన్ నిర్వహించిన పారిశుద్ధ్య సిబ్బంది



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘంలో శుక్రవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మీ, మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు ఆధ్వర్యంలో స్థానిక 20, 3, 27 వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా జంగిల్ క్లియరెన్స్, పూడిక తీతలుతో పాటు, పలు శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించి, వార్డులలోని ప్రజలకు శానిటేషన్‌పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ మేస్త్రిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కట్టా జ్యోతికి అభినందనలు



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన తరుణ్ కుమార్ భార్య కట్టా జ్యోతికి మహిళా దినోత్సవం సందర్భంగా "గ్లోబల్ పీస్ కల్చరల్ అసోసియేషన్" హైదరాబాద్ వారు సేవారంగంలో గుర్తించి "ఉమెన్ ఐకాన్ నేషనల్ అవార్డు 2024" ప్రధానం చేయటం జరిగింది. సేవారంగంలో జల్లివిక్టరీకుమార్ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఓల్డ్ ఏజ్ హెూం లో డొనేషన్లు మరియు వికలాంగులకు సేవ చేసినందుకుఈ అవార్డును ప్రధానం చేయటం జరిగింది. ఈ అవార్డును తెలంగాణ శాసనమండలి సభ్యురాలు ఎస్.వాణిదేవిచే అందుకోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకొని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్, కట్టా జ్యోతిని తన కార్యాలయమునకు పిలిపించి దుస్సాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ సమాజానికి మరింత మెరుగైన సేవచేసి మరిన్ని అవార్డులు సాధించాలని తద్వారా గ్రామానికి మండలానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలోని స్థానిక ట్రినిటి హైస్కూల్ నందు శుక్రవారం ప్రపంచ వనియోగదారుల హక్కుల దినోత్సవ అవగాహన సదస్సు అసోసియేషన్ అధ్యక్షులు బి.ఎస్.ఎన్.మూర్తి, కన్జ్యూమర్ ఫోరం జడ్జి చెక్కా సుశీ, లీగల్ మెట్రాలజి ఇన్‌స్పెక్టర్ వి.మోహన్, అసోసియేషన్ సెక్రటరీ ఎం.భాస్కరరావుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కన్జ్యూమర్ ఫోరం జడ్జి చెక్కా సుశీ వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు కన్జ్యూమర్ రైట్స్‌ను వివరించారు. తూనికలు కొలతల అధికారి మోహన్ ఎంఆర్‌పి, తదితర అంశాలపై తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు నాగార్జున, ప్రసాద్, సతీష్, సిహెచ్.శ్రీప్రియ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## చేయూత ఆధ్వర్యంలో మాతృమూర్తికి సన్మానం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** రోటరీ చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెంకట రమణమ్మ మాతృమూర్తిని ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఉదయం చేయూత సంస్థ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో చేయూత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ రవి కుమార్ నేతృత్వంలో రోటరీ గోల్డెన్ జూబ్లీ సీనియర్ సభ్యులు నేతి నాగేశ్వరరావు, భూపేంద్ర, సత్యపాల్‌తోపాటు క్లబ్ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది హరహరిశెట్టి రవికృష్ణ లు సత్కరించారు. రవికుమార్ మాట్లాడుతూ రోటరీతోపాటు సేవా సంస్థలలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి ఎంతో సేవ చేస్తున్న చిరంజీవి రెడ్డిని అందించిన గొప్ప మాతృమూర్తి ని సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కుమారుడు చిరంజీవి రెడ్డి జన్మదినోత్సవ సందర్భంగా నగరములో అనేక కార్యక్రమాలను నిర్వహించడమే కాక స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించి స్వయంగా చిరంజీవి రెడ్డి రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమని డాక్టర్ రవికుమార్ కొనియాడారు. పెద్దల పెంపకం ద్వారానే పిల్లల యొక్క గొప్పతనం తెలుస్తుందని అందుకు ఉదాహరణే చిరంజీవి రెడ్డి సేవా కార్యక్రమాలని డాక్టర్ రవి కుమార్ ప్రస్తావించారు. బ్లడ్ బ్యాంక్, రోటరీ వృద్ధాశ్రమం వంటి సంస్థల అభివృద్ధికి చిరంజీవి రెడ్డి చేసిన కృషి శాశ్వతంగా నిలిచి ఉంటుందని అందరికీ స్ఫూర్తిగా ఉందన్నారు. కుమారుడి జన్మదిన వేడుకలలో తల్లి వెంకట రమణమ్మ ను సన్మానించుకునే భాగ్యం మాకు కలగడం పట్ల ధన్యవాదాలు డాక్టర్ రవి కుమార్ తెలుపుకున్నారు. కార్యక్రమంలో మాచారెడ్డి, బదిరెడ్డి వెంకన్న, డాక్టర్ సతీష్, తాళ్లూరి శ్రీనివాసరాజు, లంక సాయిబాబు, డాక్టర్ పరశురామ్, చేయూత సంస్థ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## ప్రభుత్వ కలప అడితి ఎదురుగా 12వ రోజు విరమించిన నిరాహార దీక్షలు



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండలం ఎర్రంపేటలోని ప్రభుత్వ కలప అడితి ఎదురుగా లారీ ఓనర్స్ అసోసియేషన్ రిలే నిరాహార దీక్షలు గత 11 రోజులుగా చేస్తున్న నిరాహార దీక్షలు శుక్రవారం విరమించారు. కలపడిపోలో ఏజెంట్లు గా పనిచేస్తున్న అజయ్ కుమార్, రామకృష్ణ, వరప్రసాద్ లు, అటవీ సిబ్బంది డిఆర్ఓ, రేంజర్ అక్రమాలకు పాల్పడుతున్నారని, తమ లారీలకు పని కల్పించడం లేదని, కలప, వెదురు పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నారని అటవీ శాఖ ఉన్నతాధికారులు (సిసిఎఫ్, పిసిసిఎఫ్) వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ చింతూరు లారీ యూనియన్ అసోసియేషన్ చేస్తున్న రిలే నిరాహార దీక్ష 12వ రోజు దీక్ష విరమించారు. రేంజ్ ఆఫీసర్ కొండలరావు, డిఆర్ఓ శివ శంకర్, వరప్రసాద్, రామకృష్ణ, బిజెపి మండల అధ్యక్షులు డివిఎస్ రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆహమ్మద్ అలీ సమక్షంలో లారీ ఓనర్స్ అసోసియేషన్‌తో సంప్రదింపులు జరిపారు. దీంతో లారీ ఓనర్స్ కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమాంపజేశారు. ఇకపై చింతూరు లారీ యూనియన్ ద్వారానే రవాణా జరుపుతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు లారీ ఓనర్లు దీక్ష విరమించారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్లు బాలాజీ, కే.మహాలింగం, నక్క శ్రీను, నారాయణ, వెంకటరామరెడ్డి, అనిల్ కుమార్, కోట్ల సూర్య ప్రకాష్, ఎస్.కే. బాబ్జి, ఎం.రామ, దుర్గాప్రసాద్ రెడ్డి, ఏ.శ్రీను, కే.అచ్చన్న, ఎస్.వెంకటేష్, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కాపుల ఆశయాల దిశగా అడుగులు వేస్తున్నది సీఎం జగన్ మాత్రమే

- మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం
- కుమారుడు గిరితో కలిసి జగన్ సమక్షంలో వైకాపాలో చేరిన కాపు ఉద్యమ నేత



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** కాపుల ఆశయాల దిశగా అడుగులు వేస్తున్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రిముద్రగడ పద్మనాభం పేర్కొన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి జగన్‌ను ముద్రగడ పద్మనాభం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరి వైయస్ఆర్ సీపీలో చేరారు.ఈ మేరకు సీఎంజగన్‌వారికి వైయస్ఆర్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాపు సామాజికవర్గం వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చి కాపుల ఆకాంక్షలు నెరవేరేందుకు దోహదపడాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు (తూర్పుగోదావరి జిల్లా వైఎస్ఆర్‌సీపీఅధ్యక్షుడు), ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎ15కలెక్టర్ మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా పశు సంవర్ధక అధికారి శ్రీనివాసరావు



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** జిల్లా పశుసంవర్ధక అధికారి టి . శ్రీ ని వా న రా వు బాధ్యతలు స్వీకరించిన అనంతరము గురువారము జిల్లా కలెక్టర్ డా కె.మాధవీ లతను ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత అభినందనలు తెలియజేశారు. మాట్లాడుతూ, జిల్లాలో పెద్ద ఎత్తున అమూల్ బల్క్ మిల్క్ యూనిట్స్ కు పాల వెల్లువ సేకరణ కేంద్రాల ద్వారా పాల సేకరణ లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందన్నారు. ఆమేరకు ప్రతి రోజు ఆయా కేంద్రల నుంచి 160 లీటర్లు మేర పాలను సేకరించాలనీ అన్నారు.గుంటూరు జిల్లా తాడికొండ ఏరియా వెటర్నిటీ ఆసుపత్రిలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న టి. శ్రీనివాస రావు ఉప సంచాలకులుగా పదోన్నతి పొంది తూర్పు గోదావరీ జిల్లా పశు సంవర్ధక అధికారిగాలో విధులకు హాజరు కావడం జరిగింది.

1993లో చిలకలూరి పేట మండలము పశువుల ఆసుపత్రిలో సహాయ పశువైద్యులుగా జాయిన్ అయ్యారు.కలెక్టర్‌ను కలిసిన వారిలో డిఎహెచ్‌వో డా టి. శ్రీనివాస రావు, కొవ్వూరు డివిజన్ పశు సంవర్ధక అధికారి జీ. రాధాకృష్ణ లు ఉన్నారు.

## జెఎన్టీయుకెలో ప్రారంభమైన TORQUE-24

- రెండు రోజులపాటు నిర్వహించనున్న సాంకేతిక నైపుణ్య విజ్ఞాన సదస్సు
- తొలిరోజు 8 విభాగాలలో పోటీ





**కాకినాడ, మేజర్ న్యూస్ :** జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలోని మెకానికల్ విభాగం నందు రెండు రోజుల సాంకేతిక నైపుణ్య విజ్ఞాన సదస్సు TORQUE-24'శుక్రవారం ప్రారంభమైనది. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజైన శుక్రవారం సదస్సు ప్రారంభోత్సవం కార్యక్రమంలో సుమారు 8 విభాగాలలో పోటీ నిర్వహించడమైనది. సదస్సు ప్రారంభోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. హెచ్.ఎం కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా, వైస్ ప్రిన్సిపాల్ (అకాడమిక్స్) యు.వి.రత్నకుమారి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. మొదటిరోజు కార్యక్రమంలో రోబోటిక్స్ నందు 43 మంది విద్యార్థులు, డ్రోన్స్ ట్రైనింగ్ కార్యక్రమంలో 41 మంది విద్యార్థులు, సిఎన్‌సి ప్రోగ్రామింగ్‌లో ఎనిమిది మంది విద్యార్థులు తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. సుమారు 500 మంది విద్యార్థులు వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. సదస్సు ప్రారంభోత్సవం నందు మెకానికల్ విభాగాధిపతి డాక్టర్. దుంపల లింగరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్, డాక్టర్. వి.వరప్రసాద్, ఎం.మధుసూదన్ ప్రసాద్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బి. బాలకృష్ణ, డాక్టర్ ఎన్.మోహన్‌రావు, డాక్టర్ కె.మీరా సాహెబ్ మరియు ఇతర సిబ్బంది పాల్గొని తమ అభినందనలు తెలియజేశారు.

## గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు సమగ్ర ఏర్పాట్లు చేపట్టాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 17వ తేదీన జిల్లాలో గ్రూప్-1 పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి డా.డి.తిప్పేనాయక్ లైజాన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను కోరారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వివేకానంద హాలులో గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు నియమితులైన లైజాన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో డిఆర్ఓ తిప్పేనాయక్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై సూచనలు, ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ ఆదివారం నాడు నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్షలకు జిల్లాలో మొత్తం 6,843 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. వీరి కోసం సూరంపాలెంలోని ఆదిత్య విద్యా సంస్థలో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షల నిర్వహణ పర్యవేక్షణ, సమన్వయం కొరకు 11 మంది జిల్లా అధికారులు లైజన్ అధికారులుగా వ్యవహరిస్తారని, మరో ముగ్గురు తహాశిల్దారులు సహకరిస్తారని తెలిపారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన అన్ని ఏర్పాట్లు, సదుపాయాలను చీఫ్ సూపరింటెండ్లు చేపట్టాలని, పరీక్షల నిర్వహణపై ఎపిపిఎస్సి జారీ చేసిన సూచనలను ఇన్విజిలేటర్లు అందరికీ ముందుగా అవగాహన కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స పోస్ట్ ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓకు, పరీక్షా సమయంలో అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించాలని ఈపిడిసిఎల్ అధికారులను, ఎస్కార్టు, భద్రతా ఏర్పాటల కొరకు పోలీస్ శాఖను ఆయన కోరారు.
అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకునేందుకు వీలుగా తగిన సంఖ్యలో బస్సు సర్వీసులు నిర్వహించాలని ఆర్టిసి అధికారులను కోరారు. అన్ని పరీక్షా కేంద్రాలలో సిసి కెమేరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, చీఫ్ సూపరింటెండెంట్ తప్ప మరేవ్వరూ పరీక్షా కేంద్రంలో సెల్ ఫోన్లు గాని, ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించడం నిషేధమని తెలిపారు. అనంతరం ఎపిపిఎస్సి అసిస్టెంట్ సెక్రటరీ వసంత కుమార్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో లైజాన్ ఆఫీసర్లు వ్యవసాయశాఖ జేడి ఎన్.విజయకుమార్, పశుసంవర్ధక శాఖ జేడి సూర్యప్రకాషరావు, డ్వామాపిడి పి.వెంకటలక్ష్మి, జియం-డిఐసి టి.మురళి, ఆర్టిసి ఆర్ఎం శ్రీనివాసరావు, చీఫ్ సూపరింటెండెంట్లు, తహాశిల్దారులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని వెళ్తా

### -టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మిరియాల శిరీష దేవి



**రాజవొమ్మంగి,మేజర్ న్యూస్:** అన్ని వర్గాల ప్రజలను, టిడిపి, బిజెపి, జనసేన నాయకులను కలుపుకొని ముందుకు వెళ్తానని రంపచోడవరం నియోజక వర్గంటిడిపి(టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి) అభ్యర్థి మిరియాల శిరీష దేవి అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యేఅభ్యర్థి గా ప్రకటించిన తరువాత గురువారం సాయంత్రం స్థానికటీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసిఆమె రాజవొమ్మంగి లో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శిరీషదేవి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చిన్న వయసులో యువతను ప్రేరే పించడం లో భాగంగా టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తమకు రంపచోడవరం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గా ప్రకటించడం ఆనంద దాయకమన్నారు. టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్ అన్నకు, రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు, రంపచోడవరం నియోజకవర్గం ఇంచార్జి వంతలరాజేశ్వరి కి, స్థానిక నాయకులు కు 11మండలాల టీడీపీ ఇంచార్జిలకు,జనసేన,బీజేపీ,టీడీపీ నాయకుల కు, కార్యకర్తలుకు, ప్రజలకు ధన్యవాదములు తెలిపారు.3పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించినదుకు, చిన్న వయసులో నియోజకవర్గం భాధ్యతలు అప్పగించి నందుకు నియోజకవర్గం ని ఆదర్శవంతంగా తీర్చి దిదుతానని అన్ని వర్గాలను కలుపుకొని పోతానని భారీ మెజార్టీ తో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.అనంతరం స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దంతులూరి శివరామ చంద్రరాజును కలిశారు.మాజీఎమ్మెల్యే వంతలరాజేశ్వరి, చిన్నం బాబురమేశ్, సీతంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ను కలవడానికి రంపచోడవరం బయలుదేరి వెళ్లారు. ముప్పన కేశవ్, ఘనజాల తాతారావు, భాస్కర్, మోహనకుమార్, సావిత్రి, నాగేంద్ర చౌదరి,జనసేన నాయకులుకేబుల్‌మూర్తి, లోకేష్, బీజేపీ నాయకులు తాము సూరిబాబు, గోపి,గణపతి, తదితరులు వున్నారు.

## మోడీ అభివృద్ధి విధానాల వల్లే బీజేపీలో చేరాను

### -ఉమ్మిడి వెంకట్రావు



**ఏలేశ్వరం, మేజర్‌న్యూస్ :** ప్రధానమంత్రి మోడీ ప్రవేశపెట్టిన అనేక విధములైన అభివృద్ధి పనులను చూసి ఆకర్షితుడనయ్యి భారతీయ జనతా పార్టీలో జాయిన్ అయ్యానని, ఈ జాయినింగ్ లో కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు చిలుకూరి రాంకుమార్ ప్రోద్బలం ఉందని తెలియజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరం పట్టణంలో, స్థానిక షిరిడి నగర్ లోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విధంగా తెలిపారు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన చిలుకూరి రాంకుమార్ మాట్లాడుతూ, పూర్తిగా అవినీతి మయం అయిపోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించడానికి భారతీయ జనతా పార్టీ తెలుగుదేశం జనసేన లతో పొత్తు పెట్టు కున్నదని, అధిష్టానం ఆదేశాల మేరకు, ఎవరిని అభ్యర్థిగా ప్రకటిస్తే వారికి మద్దతిచ్చి గెలిపించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, కూరాకుల రాజా తదితరులు పాల్గొన్నారు.

## మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.రామ మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేదపండి తులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది కె.వి.డి.ప్రసాద్, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఆయుధ లైసెన్సులు కలిగిన వ్యక్తులు, సంస్థలు తమ ఆయుధాలను ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ పోలీస్ స్టేషన్లలో డిపాజిట్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ ఛాంబరులో ఆయుధ స్క్రుటినీ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్.సతీష్ కుమార్‌లతో కూడిన ఈ ద్విసభ్య కమిటీ రానున్న ఎన్నికల సందర్భంగా జిల్లా లైసెన్సు ఆయుధ నియంత్రణ అంశంపై సమీక్షించి, ప్రత్యేక అవసరాల దృష్ట్యా ఆయుధ డిపాజిటింగ్ నుండి మినహాయింపు కోరుతూ అందిన ధరఖాస్తులను పరిశీలించారు. మినహాయింపు కోరుతూ మొత్తం 39 ధరఖాస్తులు కమిటీకి అందగా, వీటిలో 33 ఆయుధాలు బ్యాంకు సెక్యూరిటీ, 3 ఆయుధాలు పరిశ్రమల సెక్యూరిటీ అవసరాలు, 2 ఆయుధాలు క్రీడల వినియోగం కొరకు రైఫిల్ అసోసియేషన్ నుండి అందిన 32 ధరఖాస్తులకు సంబంధించి ఆయుధాలకు కమిటీ మినహాయింపు జారీ చేసింది. వ్యక్తి గత అవసరాల కొరకు అందిన ఒక ధరఖాస్తును తిరస్కరించింది. ఈ సమావేశంలో డిఆర్ఓ డా.డి.తిప్పేనాయక్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# వేసవిలో పాడి పశువులు సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా.'రామస్వామి'



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధికమవుతున్న నేపథ్యంలో వేడి పెరుగుతుందని, ఆ ప్రభావం పాడి పశువుల ఆరోగ్యంపై పడడంతో పాలు, పాల దిగుబడి కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది కావున పాడి రైతులు, పాడి పశుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పశువైద్య శాఖ సహాయ సంచాలకులు డా.'తుమ్మల ఎన్.వి.ఏ.రామస్వామి' తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ పశుపోషకులు మేలైన యాజమాన్య పద్ధతులు, పశుపోషణ విషయాలలో స్వల్ప శ్రద్ధ తీసుకోవడం ద్వారా వడదెబ్బ బారి నుండి పశువులను రక్షించుకోవచ్చునని, వేడి వల్ల పశు వుల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని, ఫలితంగా రోగ నిరోధక శక్తి దెబ్బతింటుంది, కావున ఈ ప్రభావం ఆవులలో కంటే గేదెలలో ఎక్కువ అని, పశువులకు చెమటలు పడతాయని, నోటి నుంచి చొంగ కారుతుందని, నోటి ద్వారా శ్వాసించడం వల్ల ముట్టె ఎండిపోతుందని, ఎక్కువగా దాహానికి గురవుతాయని, మేత సరిగ్గా తినలేవని, ఫలితంగా శరీరంలో గ్లూకోజ్ నిల్వలు తగ్గి, నీరసించిపోతాయని, కావున పాడి పశువుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి, పశువులను నీడలో ఉంచాలని, ముఖ్యంగా చెట్ల నీడ మరీ మంచిదని, షెడ్లుకు, గాలి, వెలుతురు దారాళంగా వచ్చేలా చూసుకోవాలని, పై కప్పు రేకులు అయితే వాటిపై తాటాకులతో గాని, వరిగడ్డితో గాని కప్పుకోవాలని, పచ్చి మేత పశువులకు అందుబాటులో ఉంచుకోవాలని, షెడ్డు చుట్టూ గోతాలు కట్టి నిత్యం తడిపితే చల్లగా ఉంటుందని, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని, వడదెబ్బ తగిలిన పశువును నీడలో ఉంచి, చల్లని నీటితో తడపాలని, ఉదయం 10గంటల లోపు, సాయంత్రం 4 గంటల తరువాత మేతకు వదలాలని, రోజుకు రెండు మూడు సార్లు చల్లని నీటితో కడగాలని, విటమిన్-ఏ రోజుకు 1 గ్రామ్ చొప్పున నెలలో 8 నుండి 10 రోజులు అందించాలని, పొటాషియం క్లోరైట్ లవణాన్ని ద్రవ రూపంలో అందించాలని, వడదెబ్బ తగిలిన పశువుకు గ్లూకోజ్ సెలైన్, సోడియం క్లోరైడ్ ద్రావణాన్ని ఎక్కించాలని, ముఖ్యంగా వేసవిలో గవదవాపు, పొదుగు వాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది కావున వాటి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని, మరిన్ని వైద్యసేవల కోసం దగ్గరలోని పశువుల ఆసుపత్రిని లేదా, గ్రామంలోని యానిమల్ హజ్బెండరీ సిబ్బందిని సంప్రదించి, పశువులకు మెరుగైన వైద్య సేవలు పొందాలని పాడి రైతులకు ఆయన సూచించారు.

## నన్నయలో ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రాం



**రాజానగరం, మేజర్ న్యూస్ :** ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్' అంశాలపై ఎస్ ఆర్ టి సన్రైస్ టెక్ ఐకాన్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రర్ ఆచార్య జి సుధాకర్ హాజరై నేటి ఆధునిక సాంకేతిక యుగంలో టెక్నాలజీ యొక్క ఆవశ్యకత ఎంతో పెరిగిందని అన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీలు అందరికీ అవసరమని తెలిపారు. ఆదికవి నన్నయ విద్యాలయంలోని అధ్యాపకులు అందరికీ సాంకేతిక ప్రగతిని పెంపొందించాలని ఆలోచనతో వీసీ ఆచార్య కె పద్మరాజు చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారని తెలిపారు. సంస్థ సీఈవో ఎస్.వి.డి. రవితేజ, వెంకట భమిడిపాటి లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ప్రాధాన్యతలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రిసోర్స్ పర్సన్స్ కు రిజిస్ట్రార్ సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ టి హైమావతి యూనివర్సిటీ అధికారులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## నియోజవర్గ అభివృద్ధికై నిరంతరం పని చేశా...

-పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికై నిరంతరం పనిచేశానని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పనులలో భాగంగా... ఏపీ వివిపి నిధుల నుండి రూ. 98.80 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆసుపత్రి ప్రాంగణంలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన ఆరో ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని, తెలిపారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నారని, అడిగిన వెంటనే నిధులను నియోజకవర్గానికి మంజూరు చేసి అభివృద్ధికి సహకరించారని తెలిపారు. ప్రజలకు ముఖ్యమైనవి విద్య వైద్యం అని, గత ప్రభుత్వ పాలనలో అవి రెండూ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని, సీఎం జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత విద్య వైద్య వ్యవస్థలలో అనేక మార్పులు వచ్చాయని, కరోనా వంటి కీలక సమయంలో కూడా అధికారులు వైద్య సిబ్బంది ఎంతో శ్రమించి పని చేశారని అన్నారు. ప్రజలకు అందుబాటులో అనేక రకాల వైద్య సేవలు ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్నాయని అన్నారు. సమర్థవంతంగా పనిచేస్తున్న వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు (బాబీ), వైస్ చైర్మన్లు పచ్చిమల్ల జ్యోతి అప్పలరాజు, కొత్తపల్లి పద్మ బుజ్జి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బొజ్జ దొరబాబు, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్. పి సుజాత మరియు ఇతర వైద్య సిబ్బంది, వైఎస్ఆర్సిపి నాయకులు మటన్ లావరాజు, బాలిపల్లి రాంబాబు, సోమరౌతు లలిత, చింతాడ నేలవేణి మరియు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆనంద్ పాల్ నాయకత్వంలో జనసేన పార్టీలో చేరికలు

- ఎస్.అచ్చుతాపురం నుండి భారీ ర్యాలీ







**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం వలసపాకల గంగరాజు నగర్ రోడ్డు 1లో గల జనసేన పార్టీ రూరల్ కార్యాలయంలో 48వ డివిజన్ వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు ఆనంద్ పాల్ నాయకత్వంలో ఎస్.అచ్చుతాపురం నుండి భారీగా కార్లు, ద్విచక్ర ర్యాలీతో కార్యాలయంకు చేరుకొని సుమారు 160 మంది మహిళలు, యువత, పెద్దలు జనసేన-టీడీపీ-బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ, టీడీపీ కాకినాడ రూరల్ కో - కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొల్లాబత్తుల అప్పారావు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో పాలిక రమణ, మాగపు మహేష్, ముమ్మిడి వాసు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలపాడులో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు ఆత్మీయ కలయిక

-ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం

-జనసేన సైనికులు, బిజెపి నాయకులు



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కు రేపు రాబోయే ఎన్నికల్లో కలిసి నడుద్దాం అని జన సైనికులు, బిజెపి నాయకులు హామీ ఇచ్చారు. గండేపల్లి మండలంలో ఉప్పలపాడు గ్రామంలో జనసేన నాయకులుతమటం నాగేంద్ర, తీర్నాల శ్రీమన్నారాయణ, సత్తి సోమరాజు, గంధం వెంకన్న బాబు, బిజెపి నాయకులుటిడిపి, పోరాటి వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ కలయకకు జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టిడిపి ,జనసేన, బిజెపి, నాయకులు కార్యకర్తల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఉప్పలపాడు గ్రామం నన్ను ఎంతో ఆదరిస్తుందని రేపు రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో ఉమ్మడి అభ్యర్థిగా నన్ను ప్రకటించడం జరిగిందని మీ అందరి సహకారంతో ఈ ఎన్నికల్లో నన్ను గెలిపించి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీని, ముఖ్యమంత్రిగా చంద్రబాబుని, మన జిల్లాలో పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్ కళ్యాణ్ గారిని గెలిపించి ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి దేశాభివృద్ధికి సహకరించాలని కోరారు. టిడిపి జనసేన బిజెపి కార్యకర్తలు ముగ్గురు నాకు సమానమేనని జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, అడబాల భాస్కరరావు, మారిశెట్టి భద్రం, అడబాల రామాంజనేయులు, తమటం వీరభద్రరావు, చేవ నరసింహమూర్తి, బొల్లం రెడ్డి రామకృష్ణ, అడబాల సత్తిబాబు, బస్వా చినబాబు,ు పాల్గొన్నారు.

# అక్రమంగా పిడిఎస్ బియ్యంను తరలిస్తున్న వాహనం సీజ్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లాలోని సోమర్లకోట పట్టణ సమీపములో అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనం నంబర్ 3127 లో పి.డి.ఎస్(రేషన్ బియ్యం)తో వెళ్ళుతుంది అన్న సమాచారముతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ మరియు సివిల్ సప్లయ్స్ అధికారులతో సదరు వాహనంను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, సదరు వాహనం నందు గల 91 ప్లాస్టిక్ బస్తాలలో సుమారు 4357 కేజీల పి.డి.ఎస్ బియ్యంను గుర్తించటమైనది. సదరు పి.డి.ఎస్ బియ్యంను తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం మండలములోని మెదర బస్తి గ్రామమునకు చెందిన వాహన యజమాని శ్రీ ఎ. పవన్, తండ్రి మేఘరాజు వారు సేకరించి కొత్తగూడెం మండలములోని హేమచంద్రపురంనకు చెందిన డ్రైవర్లు చందు మరియు పి. సాయి భారత్ ల ద్వారా కొత్తగూడెం మండలములోని పాల్వంచ గ్రామము నుండి కాకినాడకు రవాణా చేయుచున్నారు. సదరు పి.డి.ఎస్ బియ్యంను అక్రమముగా తరలించుట కారణముగా సుమారు రూ 9,98,243/- లు విలువ గల 4357 కేజీల పి.డి.ఎస్(రేషన్ బియ్యం)ను మరియు పైన తెలిపిన వాహనంను సివిల్ సప్లయ్స్ అధికారులు, సోమర్లకోట వారు సీజ్ చేసి 6-ఏ క్రింద కేసు నమోదు చేసి సదరు పి.డి.ఎస్(రేషన్ బియ్యం) ఓనర్ మరియు వాహన యజమాని, వాహనం డ్రైవరులు మరియు సంబందిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు కొరకు పోలీసు స్టేషన్ కు సిఫారసు చేయటమైనది. ఈ సందర్భముగా రీజనల్ విజిలెన్స్ ఎస్.పి. శ్రీ కె.ఎస్.ఎస్.వి.సుబ్బారెడ్డి, ఐ.పి.ఎస్ గారు మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ %డ% ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పి.డి.ఎస్(చౌక బియ్యం) అక్రమ నిల్వలు, అక్రమ రవాణా పై నిరంతరం నిఘా కొనసాగుతుంది అని, ఎవ్వరైనా పి.డి.ఎస్(చౌక బియ్యం) కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని తెలిపియున్నారు. ఈ తనిఖిలలో విజిలెన్స్ అధికారులు నాగ వెంకట రాజు, లక్ష్మీనారాయణ, సి.ఎస్.డి.టి కీర్తి మరియు జీవానందం పాల్గొన్నారు.

# వినియోగదారుల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

-కలెక్టరేట్ ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో పాల్గొన్న జేసి తేజ్ భరత్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** వినియోగదారుల హక్కులను కాపాడేందుకు జిల్లాలో పటిష్టమైన ప్రణాళికలను అమలు చేస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ పేర్కొన్నారు. కలెక్టరేట్ డి ఎస్ వో కార్యాలయ సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగ దారుల దినోత్సవం సందర్భంగా "వినియోగదారుల కొరకు న్యాయమైన మరియు బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు" అంశంపై చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి తేజ్ భరత్ మాట్లాడుతూ, వినియోగదారుల్లో అవగాహన కల్పించడం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రస్తుత తరుణంలో వినియోగదారులు న్యాయమైన మరియు బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు ను జాగరుకతతో వినియోగించుకోవాలన్నారు. వినియోగ దారులు మోసపోకుండా ఉండేందుకు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజల్లోకి వినియోగ దారులు హక్కులు, ప్రయోజనాలు పై విస్తృత స్థాయిలో ప్రచారము కలుగ చేసేందుకు కార్యచరణ సిద్ధం చెయ్యాలని పేర్కొన్నారు.కార్యక్రమములో జిల్లా పౌర సరఫరాల అధికారి పి. విజయ భాస్కర్, జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ రుక్కయ్య, అసిస్టెంట్ కంట్రోలర్ శామ్యూల్ రాజు, ఇన్స్పెక్టర్, లీగల్ మెట్రాలజీ శివ బాలాజీ, స్వామి నాధన్, హరిబాబు, స్టూడెంట్స్ కన్స్యూమర్ క్లబ్స్ మాస్టర్ ట్రైనీస్, జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు, విజిలెన్స్ సభ్యులు, కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజర్స్, చౌక ధరల దుకాణ డీలర్లు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకంతో 4490 మంది గర్భిణులకు లబ్ది

- వై.ఎస్.ఆర్. ఆరోగ్య ఆసరాతో 14,440 మందికి గాను 08.34 కోట్లు అందజేత

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జె.నరసింహ నాయక్ వెల్లడి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకములో భాగముగాఈఆర్థిక సంవత్సరం రూ.1,77,09,000లు నమోదు చేసుకున్నవారికి గాను మొత్తం 4490 మంది అర్హులైన గర్భిణి స్త్రీలకు లబ్ధి చేకూర్చడమైనదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జె.నరసింహ నాయక్ తెలియజేశారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకమును జిల్లాలో ది.01-01-2017 తేదీన ప్రారంభించారని, ఈ పథకములో నమోదైన గర్భిణి స్త్రీలకు రూ.5వేలు రెండు విడతలుగా అందజేయడం జరుగుతుంది. మొదటి విడతగా రు. 3000/- (వందరోజుల లోపు నమోదుచేయవలెను), రెండవ విడత రూ.2000లు (14 వారాల టీకాలు నమోదు అయిన తరువాత) ఆధార్ తో అనుసందానం కాబడిన గర్భిణి యొక్క బ్యాంక్ అక్కౌంట్ కి నేరుగా జమ చేయబడునన్నారు. అదనముగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిపించుకున్న గర్భిణి స్త్రీలకు జనని సురక్ష యోజన పథకం ద్వారా గ్రామీణప్రాంత ప్రజలకు రూ.1000లు, పట్టణ ప్రాంత ప్రజలకు రూ.600లు అందచేయబడుతుందని తెలియజేశారు. 01-04-2022 నుండి రెండవ కాన్పులో ఆడ పిల్ల పుట్టిన వారికి ఒకే విడతలో రూ.6000లు (14 వారాల టీకాలు నమోదు అయిన తరువాత ) అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ పథకములో భాగముగా ఈ ఆర్థిక సంవత్సరం 1,77,09,000/- రూపాయలు నమోదు చేసుకున్న వారికి గాను మొత్తం 4490 మంది అర్హులైన గర్భిణి స్త్రీలకు లబ్ధి చేకూర్చడమైనదని తెలియజేశారు. వై.ఎస్.ఆర్.ఆరోగ్యఆసరా పథకం 01.12.2019న ముఖ్యమంత్రి ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం పొంది విశ్రాంతి సమయంలో జీవనోపాధికోల్పోకూడదనేఉద్దేశ్యంతో ప్రారంభించా రని, ఈ పథకం ద్వారా 2022-23లో 30,414 లబ్ధిదారులకు 17.07 కోట్లు ఇవ్వడం జరిగినదన్నారు. అదేవిధంగా 2023-24 లో ఇప్పటి వరకు 14,440 మందికిగాను 08.34 కోట్లు అందజేయడం జరిగినదని జిల్లావైద్యఆరోగ్యశాఖాధికారి జె.నర సింహ నాయక్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన విశాఖ స్టీల్ ప్లాంట్ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలి



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** నేడు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోవిశాఖలో తలపెట్టిన స్టీల్ ప్లాంట్ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మహ్మద్ అలీ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడు తూ పార్టీలకతీతంగా ప్రజల స్వచ్ఛందంగా పాల్గొని విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అయినటువంటి స్టీల్ ప్లాంట్ ను రక్షించుకోవడంలో భాగంగా జరగబోయే సభలో తెలంగాణసీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి పాల్గొన నున్నారని ఈ సభకు రంపచోడవరం నియోజకవర్గం వేలాదిగా పాల్గొనాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కాంగ్రెస్ పార్టీ పూర్తి వ్యతిరేకమని కేంద్రంలో త్వరలో అధికారంలో రానున్నామని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పట్ల జనసేన టిడిపి వైసిపి వైఖరి తెలపాలన్నారు.వారి మౌనాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని త్వరలో ఈ పార్టీలన్నిటికీ ప్రజలే బుద్ధి చెబుతారని విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సభను మండలం నుండి ప్రజలు పాల్గొని స్టీల్ ప్లాంట్ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని మొహమ్మద్ అలీ షేక్ కోరారు.

## జగ్గంపేటలో చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్‌కు, లోకేష్‌కు సగరులు పాలాభిషేకం

-జ్యోతుల నెహ్రూను ఘనంగా సత్కరించిన కాకినాడ జిల్లా బీసీ సాధికార సగర కమిటీ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కాకినాడ జిల్లా బీసీ సాధికార సగర కమిటీ జిల్లా అధ్యక్షులు గుర్రం సుబ్బారావు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సగరులను గుర్తించి సగర కులాన్ని బీసీడీ నుంచి బీసీఏ కేటగిరికి మారుస్తున్నామని భవన నిర్మాణ కార్మికులుగా ఉన్న సగరులను రోడ్ల భవన నిర్మాణ కాంట్రాక్టర్లు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని నారా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ప్రకటించిన సందర్భంగా జగ్గంపేటలో పార్టీ కార్యాలయంలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లోకేష్ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈ సందర్భంగా టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గుర్రం సుబ్బారావు మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సగరులను బీసీ డీ నుండి ఏ కు మారుస్తామని హామీ ఇచ్చి సగరకులాన్ని ఆదుకుంటామని అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేసిన మా నాయకులకు అభినందనలు తెలియజేసే కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అలాగే జ్యోతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గంలో సగరులకు పెద్దపీట వేస్తూ నియోజవర్గంలో అన్ని కమిటీల్లో సగరులను తీసుకోవడమే కాకుండా వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తున్నందుకు వారిని కూడా ఘనంగా సత్కరిస్తున్నామని అన్నారు. రేపు రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి సంకీర్ణ ప్రభుత్వాన్ని గెలిపించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు పోట్రూ కృష్ణ, బీసీ సాధికారిక సగర కమిటీ జిల్లా నాయకులు నంగన శ్రీను, గండికోట నాగేశ్వరరావు, పోంద్రు బాలనాగు, జలతారపు శ్రీను, పిండి సత్యనారాయణ ఇంకెవరిని పిండి సత్యనారాయణ, గండికోట సింహాచలం, తనిబోయిన వీరబాబు, అధిక సంఖ్యలో సగరులు నాయకులు పాల్గొన్నారు.

## పిఠాపురం పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్...



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** రానున్నఎన్నికల నేపథ్యం లో శాంతి భద్రతల పరిరక్షణకు పిఠాపురం పట్టణ ఎస్ఐ మురళీ మోహన్ ఆధ్వర్యంలో. .. పారా మిలటరీ బలగాలతో పిఠాపురం పట్టణ పరిధిలోని జగ్గయ్య చెరువు కాలనీ, భీమ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ (పోలీస్ కవాతు ) నిర్వహించారు. ఎన్నికల దృష్ట్యా ఎవరు ఆ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, గొడవలు కొట్లాటకు దిగినచో పోలీసు వారు తీసుకునే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని, ప్రజలంతా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## చెందుర్తిలో మహిళ దారుణ హత్య

**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు మండలం చెందుర్తిలో శుక్రవారం తెల్లవారుజామున ఒక మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... చెందుర్తి గ్రామానికి చెందిన అయినవిల్లి కుమారి (48) భర్తతో విడిపోయి అదే గ్రామానికి చెందిన తాటిపర్తి కనకలింగేశ్వర రావుతో గడచిన 20 సంవత్సరాలుగాసహజీవనంచేస్తోంది. ఇటీవల కనకలింగేశ్వం రావుకు కుమారిపై అనుమానం ఏర్పడింది. వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుంటున్నావంటూ తరచూ కనక లింగేశ్వరరావు కుమారితో గొడవకు దిగుతున్నాడు. దీంతో వీరు ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున సదరు విషయమై ఇరిరువురి మధ్య మరో మారు వివాదం ఏర్పడింది. దీంతో సహనం కోల్పోయిన కనక లింగేశ్వరరావు మడత మంచం కర్రతో కుమారిని తలపై కొట్టాడు. బలంగా దెబ్బ తగలడంతో తల పగిలి తీవ్రంగా గాయపడిన కుమారి స్పృహ కోల్పోయి కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడు కనక లింగేశ్వరరావును స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్సై బాలాజీ ఘటనా స్థలానికి చేరుకొని కుమారి మృతదేహాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలపై స్థానికుల నుండి సమాచారం సేకరించారు. మృతురాలు సోదరుడు ఏడిద మోషి ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై హత్య నేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారి హత్యతో చెందుర్తి దళితపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.